క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సూచనలు చేస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి

సుల్తానాబాద్: రెండురోజులుగా వర్షాలు కురుస్తుండన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి సూచించారు. రోడ్డుపై వరద నీరు నిల్వ ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చైర్‌పర్సన్ తక్షణమే స్పందించి వర్షపు నీటిని దారిమళ్లించారు. మున్సిపల్ పరిధిలో ఉన్న సుభాష్‌నగర్ జలాశయం కావడంతో శనివారం జేసీబీ సహకారంతో తొలగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా రహదారులు, కాలనీల్లోని ఇళ్లలోకి నీరు చేరితే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివసించవద్దని, వర్షాల కారణంగా కూలిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. మున్సిపల్ కమిషనర్ కట్ల వేణుమాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై సర్వే



సర్వే చేస్తున్న వైద్య విద్యార్థులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి, ముల్కలపల్లి గ్రామాల్లో రామగుండం సింగరేణి మెడికల్ కళాశాల ద్వితీయ సంవత్సరం వైద్య విద్యార్థులు శనివారం ఇంటింటా ప్రజల ఆరోగ్యంపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. సిమ్స్ ప్రిన్సిపాల్ హిమబిందు ఆదేశాల మేరకు కళాశాల విద్యార్థులు కుటుంబ దత్తత తీసుకొని ప్రతి నెలా ప్రజల ఆరోగ్య స్థితిని తెలుసుకుంటూ వారికి వైద్య సలహాలు ఇస్తున్నారు. ఇన్‌చార్జి హెచ్‌వోడీ డాక్టర్ శ్రీదేవి, కావ్యరాసన్, రవీందర్, నాగరాజులు, కమాన్‌పూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్ నిర్మూలనకు యువత సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ కృష్ణ

పెద్దపల్లిరూరల్: డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు యువత సహకరించాలని సీఐ కృష్ణ సూచించారు. పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీలో శనివారం 'డ్రగ్స్ వద్దు.. ప్రాణం ముద్దు' అంశంపై సెమినార్ నిర్వహించరు. సీఐ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌లాంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్ నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి రవూఫ్‌ఖాన్, ఎస్సై మల్లేశ్, కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్ ఉన్నారు.

మహిళలకు శిక్షణ పరికరాలు పంపిణీ



కుమారస్వామిని సన్మానిస్తున్న మహిళలు

రామగిరి: మండలంలోని కల్వచర్లలో కుట్టుశిక్షణ నేర్చుకుంటున్న మహిళలకు శనివారం గ్రామానికి చెందిన రేండ్ల కుమారస్వామి శిక్షణ పరికరాలను అందజేశారు. తన తండ్రి రేండ్ల వెంకటయ్య స్మారకార్థం మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ కల్పిస్తూ కత్తెరలు అందజేశారు. అనంతరం మహిళలు రేండ్ల కుమార్ స్వామిని సన్మానించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుల అరెస్టు

పాలకుర్తి: బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద శనివారం గంజాయి విక్రయించే ముగ్గురు యువలకులను బసంత్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం కన్నాల టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా రామగుండం పట్టణానికి చెందిన బానోతు రమేశ్, గుగులోతు రాజేశ్‌నాయక్, పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్ళపల్లికి చెందిన గాలిపెల్లి నిఖిల్ రెండు బైక్‌లపై అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో అదుపులోకి తీసుకుని విచారించగా వారివద్ద 242గ్రాముల గంజాయి లభించినట్లు తెలిపారు. తోకల సిద్దార్థ అనే వ్యక్తి దగ్గరు నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయించి డబ్బులు సంపాదించాలనే ఆశతో గంజాయిని కొనుగోలు చేసినట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు పక్కనే డంపింగ్

- చెత్తాచెదారంతో దుర్గంధం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వాహనదారులు, విద్యార్థులు
- సమస్య పరిష్కరించాలని వినతి



రోడ్డు పక్కనే చెత్తా చెదారం

కమాన్‌పూర్: ఊరిలో సేకరించిన చెత్తా చెదారం, వ్యర్థ పదార్థాలను తీసుకొచ్చి ప్రజలు ప్రధాన రహదారుల వెంట పడేస్తున్నారు. దీంతో దారి వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు, స్థానికులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కొన్నేళ్ల నుంచి డంపింగ్‌యార్డుకు స్థలం లేకపోవడంతో ఈ సమస్య పరిష్కారం కావడం లేదు. కమాన్‌పూర్ మండల కేంద్రంలో డంప్‌యార్డు ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వ స్థలం లేకపోవడంతో డంప్‌యార్డు ఏర్పాటు సమస్య ఏర్పడింది. గత పాలకులు, అధికారులు ప్రభుత్వ భూమి లేకపోవడంతో డంప్‌యార్డు ఏర్పాటు చేయలేకపోయారు.

రహదారుల వెంటే..

గ్రామంలో సేకరించిన చెత్తా చెదారాన్ని ట్రాక్టర్‌లో తీసుకొచ్చి మండల కేంద్రం నుంచి గోదావరిఖని, పిల్లిపల్లెకు వెళ్లే ప్రధాన రహదారుల పక్కనే డంప్ చేస్తున్నారు. దీంతో సమీపంలోని నివాసులతో పాటు దారి వెంట వెళ్లే వాహనదారులు, విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాల కోసం వీధి కుక్కలు రహదారుల వెంట సంచరిస్తూ దారి వెంట వెళ్లే వారి వెంటపడి తరుముతున్నాయి. మండల కేంద్రంలోని శ్మశాన వాటిక వద్దనే డంప్ చేస్తుండడంతో దహన సంస్కారాలు చేసేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

స్థలం కొరత కారణం..

మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో డంప్‌యార్డు ఏర్పాటు చేయలేకపోతున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. గుండారం గ్రామ శివారులోని గుట్ట సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమి ఉన్నప్పటికీ అక్కడికి చెత్త తీసుకెళ్లే ట్రాక్టర్ వెళ్లేందుకు బండల వాగుతో పాటు రహదారి సరిగా లేకపోవడం, దూరం ఎక్కువ ఉండడంతో చెత్తను తరలించకపోతున్నట్లు అధికారులు తెలిపారు.

స్థలం లేక ఇబ్బంది



మండల కేంద్రంలో డంప్‌యార్డు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థలం లేక ఇబ్బంది ఏర్పడుతోంది. సమస్య ఉందని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– శేషయ్యసూరి, ఇన్‌చార్జి ఎంపీడీవో, కమాన్‌పూర్

కోల్‌కారిడార్ రోడ్డుపై వరదనీరు

- ఇరువైపులా నిలుస్తున్న రాకపోకలు
- పట్టించుకోని యాజమాన్యం



రోడ్డుపై పారుతున్న వరద నీరు

గోదావరిఖని: భారీ వర్షం కురిస్తే కోల్‌కారిడార్ రోడ్డుపై వరద నీరు చేరుతోంది. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గోదావరిఖని–యైటింక్లయిన్‌కాలనీ–సెంటినరీకాలనీకి వెళ్లేందుకు సింగరేణి యాజమాన్యం కోల్ కారిడార్ పేరుతో సుమారు 20కిలోమీటర్ల మేర రోడ్డును నిర్మించింది. ఈరోడ్డు వెంట నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తాయి. ఓసీపీల విస్తరణతో గతంలో ఉన్న పాత రోడ్డును మార్చి సింగరేణి పదేళ్ల కిందట కోల్ కారిడార్ పేరుతో రోడ్డు నిర్మించింది. అయితే ఈరోడ్డు నిర్మాణం తర్వాత చాలా ప్రమాదాలు జరిగాయి. అనేక మూలమలుపులు, ఇరుకైన రోడ్డుతో నిత్యం కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఓసీపీ–3 ఓబీ డంప్ యార్డు ప్రధాన రోడ్డు పక్కనే ఏర్పాటు చేయడంతో వీర్లపల్లి గ్రామ సమీపంలోని కోల్‌కారిడార్ రోడ్డుపై భారీగా వరద నీరు వచ్చి రోడ్డుపై చేరుతోంది. గురువారం కురిసిన వర్షానికి భారీగా వరద నీరు చేరడంతో గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గోదావరిఖని–యైటింక్లయిన్ కాలనీ వెళ్లే ప్రయాణికులతో పాటు డ్యూటీకి వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడ్డారు.

సైడ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

రోడ్డుపై వరద నీరు నిలవకుండా సైడ్‌డ్రైనేజీ ఏర్పాటు చేయాలని కార్మికులు కోరుతున్నారు. ఒక పక్క ఎన్టీపీసీ రైల్వేట్రాక్, మరో పక్క ఓసీపీ–3 డంపర్‌యార్డు మధ్యలో కింది భాగంలో రోడ్డు ఉండటంతో వర్షానికి వచ్చే వరదనీరు భయటకు వెళ్లే మార్గం లేకుండా పోతోంది. దీంతో రోడ్డుపై మీటరు లోతు నీళ్లు నిలిచిపోతున్నాయి. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి రోడ్డు మార్గంలో వరదనీరు నిలవకుండా చూడాలని కోరుతున్నారు.

పాఠశాలల్లో గ్రీన్ డే



పండ్ల మొక్కలతో పాఠశాల విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని గీతాంజలి హైస్కూల్‌లో శనివారం గ్రీన్‌డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు మొక్కలు నాటారు. మొక్కలు నాటి కాపాడితే కలిగే ప్రయోజనాలను అకడమిక్ డైరెక్టర్ రేపాల రోహిత్, కరస్పాండెంట్ రజిత పేర్కొన్నారు. హెచ్‌ఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే గాయత్రీ విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులంతా ఆకుపచ్చ దుస్తులతో గ్రీన్‌డేలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ మొక్కలు పంపిణీ చేశారు. చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ, ప్రిన్సిపాల్ విజయ్ పాల్గొన్నారు.

ఆలీవర్ పాఠశాలలో..

పాలకుర్తి: బసంత్‌నగర్‌లోని ఆలీవర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం గ్రీన్ డే వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. ఆషాఢమాసం సందర్భంగా విద్యార్థినులు, మహిళా టీచర్లు గోరింటాకు పెట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ జాఫర్ బేగ్, టీచర్లు వెంకటేశ్వర్లు, స్వామి, లక్ష్మణ్, శ్రీదేవి, పద్మాంజలి, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేడు మంథనిలో గంగాదేవి బోనాలు

మంథని: గంగాదేవి బోనాల జాతర ఆదివారం మంథనిలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంబటి సతీశ్, గందం వెంకటస్వామి, బోయిని నారాయణ తెలిపారు. బోయిన్‌పేట నుంచి గోదావరి నది వరకు బోనాలతో ప్రదర్శన ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని గంగపుత్రులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

బోనాల జాతరకు రండి

సుల్తానాబాద్: పట్టణంలో ఆదివారం నిర్వహించే బోనాల జాతరకు రావాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డిని గౌడ సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీరేణుక ఎల్లమ్మ బోనాల వనభోజనం మహోత్సవానికి వచ్చి విజయవంతం చేయాలని స్థానిక గౌడ సంఘం ప్రతినిధులు కోరారు.

అంగన్‌వాడీ సేవలు వినియోగించుకోవాలి

జూలపల్లి: ఆటపాటలతో కూడిన విద్య అందజేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలను చిన్నారుల తల్లిదండ్రులు వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి, హెచ్‌వీ వసంత, అంగన్‌వాడీ కార్యకర్తలు శైలజ, అలేఖ్య, నర్సమ్మ, ఉమారాణి ఉన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: పట్టణంలోని శివాలయంలో ఉన్న నవగ్రహ, హనుమాన్ విగ్రహానికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు శివాలయంలో రుద్రాభిషేకంతో పాటు అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు పూజారి మహేశ్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాదిగశక్తి సదస్సుకు తరలిరండి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఆదివారం తలపెట్టిన మాదిగశక్తి సదస్సుకు అధికసంఖ్యలో తరలిరావాలని వ్యవస్థాపకుడు బొంకూరి సురేందర్‌సన్నీ కోరారు. పట్టణంలోని అమర్‌చంద్ కల్యాణ మండపంలో జరిగే సదస్సుకు మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ప్రొఫెసర్ చింతకింది ఖాసీం, హైకోర్టు న్యాయవాది శరత్, విఠల్, బక్క జడ్సన్ హాజరవుతున్నారని తెలిపారు.

కోనరావుపేటలో వైద్యశిబిరం

జూలపల్లి: మండల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కోనరావుపేటలో వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యాధికారి సంపత్‌రెడ్డి వైద్యపరీక్షలు చేశారు.

మంగపేటలో..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మంగపేటలో శనివారం ఆరోగ్య సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి మందులు అందించారు.

ఇసుక లారీలు స్వాధీనం

మంథని: మంథని నుంచి హైదరాబాద్‌కు ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా రెండు లారీలను పట్టుకున్నట్లు ఎస్సై వెంకటకృష్ణ శనివారం తెలిపారు. అడవిసోమన్‌పల్లిలో ఇసుక చోరీకి పాల్పడి హైదరాబాద్ తరలిస్తుండగా ఎక్లాస్‌పూర్ అటవీశాఖ చెక్‌పోస్టు వద్ద శనివారం పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. నల్గొండకు చెందిన లారీ డ్రైవర్లు కరెంగు నర్సింహ, నకీర్తి ఆంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి అధికారుల నిర్లక్ష్యంతోనే బొగ్గు గనుల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని ఆర్జీ–2 ఏరియా సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరసింహారావు శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఓసీపీ–2లో జరిగిన ప్రమాదంలో కార్మికుల మృతికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

గురు పౌర్ణమికి ముస్తాబైన ఆలయం

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం

గోదావరిఖనిటౌన్: అమ్మ మాట అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇందిరానగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. టీచర్ జి.రజిత పిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు.

గోరింటాకు వేడుకలు



గోరింటాకు నూరుతున్న మహిళలు

గోదావరిఖనిటౌన్: స్థానిక మార్కండేయకాలనీ గణేశ్‌నగర్‌లోని శ్రీలక్ష్మీగణపతి మిత్రమండలి మహిళలు జరుపుకుంటున్న గోరింటాకు వేడుకలకు బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి సంధ్యారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో మండలి మహిళలు బుర్ర వీణ, సత్యవతి, శ్రీదేవి, రమాదేవి, వినోద, శ్రీలత, సౌజన్య, శిరీష, పద్మజ, హారిక, కళ్యాణి, సునీత, ఉమ, శారద పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

రామగిరి: ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న సింగరేణి ఉద్యోగులకు శనివారం జీఎం ఎన్.సుధాకర్‌రావు ఆదేశాల మేరకు క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. 186 ఖాళీ క్వార్టర్లు ఉండగా ఫ్రెష్ అలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ కోసం 86మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారని ఏపీఏ ఎస్‌వోటూ జీఎం బి.సత్యనారాయణ తెలిపారు. 24 మంది ఉద్యోగులు హాజరై 23మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారని, వారికి త్వరలోనే అలాట్‌మెంట్ లెటర్స్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్‌రెడ్డి, డీవైపీఎం వి.సునీల్‌ప్రసాద్, సీనియర్ పీవో మతిన్ హుస్సేన్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, క్వార్టర్ల విభాగం సిబ్బంది మహేందర్, సుధాకర్ పాల్గొన్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

గోదావరిఖని: ఆషాడ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం స్థానిక సింగరేణి అధికారుల బంగ్లోస్ ఏరియా దుర్గామాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలురకాల కూరగాయలతో అలంకరించి బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్జీ–1, 2, 3 సేవా అధ్యక్షురాలు చింతల లక్ష్మి, మాలతి, కృష్ణవేణి, చిలక లక్ష్మి, బీనాసింగ్, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు లలిత సహస్రనామ పారాయణం చేశారు.

కౌండిన్యకు ఉపాధ్యాయుల వర్క్‌షాప్ ఆహ్వానం

రామగిరి: కేంద్ర శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన పరిషత్ రీజనల్, బెంగుళూర్ వారు రెండు రాష్ట్రాల్లో నిర్వహించే ఉపాధ్యాయుల వర్క్‌షాప్‌నకు సెంటనరీకాలనీ వాణి సెకండరీ పాఠశాల భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు దూసి కౌండిన్యకు ఆహ్వానం అందింది. ఈ నెల 23, 24 తేదీల్లో కర్ణాటకలో, 25, 26 తేదీల్లో తమిళనాడులో నిర్వహించే వర్క్‌షాప్‌నకు కౌండిన్య హాజరు కానున్నారు. ఈ వర్క్‌షాప్‌లలో కౌండిన్య ఆటలు, బొమ్మల సాయంతో భౌతిక శాస్త్రాన్ని సులభంగా బోధించే పద్ధతిని అక్కడి ఉపాధ్యాయులకు, జూనియర్ లెక్చరర్లకు శిక్షణ ఇవ్వనున్నారు.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

యైటింక్లయన్కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ శ్రీవాణి పాఠశాలలో శనివారం గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులను గౌరవంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. అలాగే ఆషాఢం సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు.

ప్రజలకు నీతివంతమైన పాలన అందిస్తాం



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: నియోజకవర్గంలో నీతివంతమైన పాలనను ప్రజలకు అందిస్తూ మన్ననలు పొందుతున్నామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీ ఆర్ గార్డెన్‌లో శనివారం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు, స్థానిక ప్రజాప్రతినిధులు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గంలో అవినీతి అక్రమాలకు తావివ్వకుండా పరిపాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు రైస్‌మిల్లు యజమానులతో పాటు అధికారులతో మాట్లాడి వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కిలో సైతం కత్తిరించకుండా మొదటిసారి అందరికీ ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేశారన్నారు. 68 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, వెస్ చైర్మన్ బిరుదు సమత, కౌన్సిలర్ సునీత, రాజయ్య, రఫీక్, సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్, డీసీఎంఎస్ జిల్లా మాజీ డైరెక్టర్ జానీ, చక్రపాణి, చిలుక సతీశ్, మాజీ సర్పంచులు అన్నయ్యగౌడ్, ప్రకాశ్‌రావు, రమేశ్, మహేందర్, రామన్న, రాజలింగం, శ్రీనివాస్, ఆంజనేయులు, అబ్బయ్యగౌడ్, చంద్రయ్యగౌడ్, చక్రపాణి, సతీశ్, వెంకటేశం పాల్గొన్నారు.

అత్యవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలి

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ సూచించారు. మండలంలోని నీరుకుల్ల, గర్రెపల్లి, గట్టెపల్లి, కదంబాపూర్, మంచిరామి గ్రామాల్లోని వరదను శనివారం ఎస్సై పరిశీలించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వరద ఉధృతి పెరుగుతోందని, చెరువుల్లో చేపలు పట్టేందుకు వెళ్లొద్దని, పశువుల కాపర్లు పశువులు మేపేందుకు తీసుకెళ్లొద్దని సూచించారు. ఏదైనా అత్యవసరమైతే పోలీసులకు, డయల్ 100కు కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు.



వరదను పరిశీలిస్తున్న ఎస్సై శ్రావణ్‌కుమార్

గుండారం రిజర్వాయర్‌కు జలకళ



నిండుకుండలా గుండారం రిజర్వాయర్



అలుగు పారుతున్న రిజర్వాయర్

కమాన్‌పూర్: మండలంలోని గుండారం రిజర్వాయర్‌కు జలకళ సంతరించుకుంది. పూర్తిస్థాయి నీటిమట్టంతో అలుగు పారుతుండడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొన్నిరోజుల క్రితం వరకు నీటిమట్టం తగ్గిపోయి వెలవెలబోయిన రిజర్వాయర్ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సమీపంలోని గౌరీగుండం జలపాతం నుంచి వస్తున్న వరదనీటితో పూర్తిస్థాయి నీటిమట్టం పన్నెండు అడుగులకు చేరి అలుగు దునుకుతోంది.

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకే పల్లెనిద్ర

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో శాంతిభద్రత పరిరక్షణకే పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో శనివారం ఎస్సై శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో పల్లె నిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండ చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎస్సై నరేశ్, గ్రామ ప్రజలు, నాయకులు, యువత ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ సుబ్బారెడ్డి

మత్తడి ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

జూలపల్లి: మండలంలోని వెంకట్రావుపల్లెల్లో ఊర చెరువు మత్తడి ధ్వంసం చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వడ్కాపూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కనకట్ల స్వామి ముదిరాజ్, ఉపాధ్యక్షుడు జెట్టి సతీశ్ కోరారు. శనివారం సంఘం సభ్యులతో కలిసి తహసీల్దారు బషీరుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. 200 కుటుంబాలకు ఉపాధి కల్పించే చెరువు మత్తడి ధ్వంసంతో నీరు నిలవక చేపలు పెంచుకునే అవకాశం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసం చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం సభ్యులు రమేశ్, వెంకటేశం, శ్రీనివాస్, స్వామి, రాజయ్య, కొండయ్య, హరీశ్, నర్సింగం, సంపత్, సాయికుమార్, రాజు, లచ్చయ్య, ఓదయ్య ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్ దాడులు

రామగిరి: మండలంలోని బేగంపేటలోని గుడుంబా స్థావరాలపై శనివారం రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. అందిన సమాచరం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కంచల చెరువు సమీపంలో నిర్వహిస్తున్న గుడుంబా స్థావరాలపై దాడి చేసి వెయ్యి లీటర్ల బెల్లం పానకం, సామగ్రి ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న నిందితుడు బేగంపేటకు చెందిన బొంతల రమేశ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని చూసి పారిపోయాడు. కాగా 18 లీటర్ల గుడుంబా పట్టుకొని రామగిరి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. నాటు సారా తయారుచేస్తే పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు ఏలియా, మహేందర్, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, సునీల్, రాజేందర్ ఉన్నారు.

బదిలీ టీచర్లకు సన్మానం



కమాన్‌పూర్: మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసిన గోపాల్, రవీందర్‌రెడ్డి, మల్లయ్య, స్వరూప, సతీశ్ ఇటీవల బదిలీ అయ్యారు. వీరిని శనివారం పాఠశాలలో సన్మానించారు. రమణారెడ్డి, సత్యనారాయణ, తన్వీర్, ఉమామహేశ్వరి, సంతోష్‌కుమార్, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ ఎలువాక సతీశ్ పాల్గొన్నారు.

నేడు అఖిల భారత యాదవ మహాసభ సమావేశం

రామగిరి: సెంటనరీకాలనీ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం నిర్వహించనున్న అఖిల భారత యాదవ మహాసభ సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి ఉడుత పర్వతాలు యాదవ్, యాదవ సంఘం సీనియర్ నాయకులు తోట్ల తిరుపతి యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం రామగిరి మండల నూతన కార్యవర్గం, యూత్ కమిటీల నియామకాలు నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెద్దపల్లి జిల్లా :
9951602934
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
పెద్దపల్లి : కె.తిరుపతి, ACO - 7997958206
పెద్దపల్లి : ఎం.మహేందర్, SR - 9573331940
మంథని : రాజేశ్ - 9676603963
రామగుండం : సర్వార్ - 6281694028
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899